కామాంధులను కఠినంగా శిక్షించాలి

- నినదించిన వైద్యులు, వైద్య విద్యార్థులు
- కోల్‌కత్తా ఘటనపై నిరసనలు



వేములవలస కూడలిలో నిరసన తెలియచేస్తున్న వైద్య విద్యార్థులు



తగరపువలసలో మానవహారం నిర్వహిస్తున్న వైద్య విద్యార్థులు

తగరపువలస: కోల్‌కత్తాలోని ఆర్‌జీకే మెడికల్ కళాశాల పీజీ విద్యార్థినిపై లైంగికదాడికి పాల్పడి, కిరాతకంగా హతమార్చిన రాక్షసులను కఠినంగా శిక్షించాలని వైద్యులు డిమాండ్ చేశారు. దారుణ ఘటనను ఖండిస్తూ వైద్యులు శనివారం నిరసన బాట పట్టారు.

- ఆనందపురం మండలం వేములవలస డాక్టర్ లక్ష్మణ్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య విద్యార్థులు నిరసన చేపట్టారు. ఆడబిడ్డలకు రక్షణ కరువైందన్న నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు లక్ష్మణ్, సిహెచ్.త్రినాధరావు, యమున, వివేకానంద, కళాశాల కరస్పాండెంట్ నాయుడు, ప్రిన్సిపాల్ మీసాల అప్పలరాజు, భూషణ్, ఆస్పత్రి, నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.
- సంగివలస అనిల్ నీరుకొండ మెడికల్, నర్సింగ్, దంత వైద్య కళాశాలలకు చెందిన వందలాది మంది విద్యార్థులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. సంగివలస నుంచి సర్వీస్‌రోడ్డు మీదుగా అంబేడ్కరు కూడలికి చేరుకుని మానవహారం నిర్వహించారు. వైద్యవిద్యార్థినిని అమానుషంగా హింసించి, హతమార్చిన దుండగులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ పీవీ సుధాకర్, సీఈవో చంద్రశేఖరరెడ్డి, ప్రిన్సిపాల్స్ వంశీకృష్ణారెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ ప్రతిమాదేవి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

భీమునిపట్నం: కోల్‌కత్తా ఘటనను నిరసిస్తూ స్థానిక చిన్నబజారు జంక్షన్ వద్ద పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది ఆందోళన చేపట్టారు. డాక్టర్ జి.కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ ఇంత దారుణం జరిగినా బాధిత కుటుంబానికి ఇంతవరకు తగిన న్యాయం జరగలేదన్నారు. నిందితులకు కఠిన శిక్ష పడాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత వైద్యురాలు సీహెచ్.కనకదుర్గ, కమ్యూనిటీ ఆర్గనైజర్ వై.మీనాక్షి, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వైద్యసేవలు బంద్

పీఎం పాలెం: కోల్‌కతా ఘటనకు వ్యతిరేకంగా పీఎం పాలెంలోని ప్రభుత్వ రూరల్ ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది శనివారం ఆస్పత్రిలో వైద్య సేవలు నిలిపివేశారు. ఘటనను నిరసిస్తూ ఆస్పత్రి వద్ద బైఠాయించారు. స్థానిక వైద్యాధికారి సుజాన్ పల్లా మాట్లాడుతూ జరిగిన అమానుష సంఘటన వైద్య లోకాన్ని ఆందోళనకు గురిచేసిందన్నారు. నేరస్తులను పట్టుకుని ఉరిశిక్ష వేయాలన్నారు. సిబ్బంది నిరసనకు స్థానికులు మద్దతు ప్రకటించారు.

వైద్యులు, వైద్య విద్యార్థుల ర్యాలీ

కొమ్మాది: కోల్‌కత్తాలో వైద్యవిద్యార్థినిపై జరిగిన ఘటనకు నిరసనగా గీతం వైద్య విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. దాడులను అరికట్టేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టమైన చట్టాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వైద్య విద్యార్థిని ఘటనకు బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు.

- జీవీఎంసీ 4వ వార్డు చేపలుప్పాడ యూపీహెచ్‌సీ వద్ద వైద్యులు నిరసన వ్యక్తం చేశారు.



భీమిలి : ఆందోళన చేస్తున్న పీహెచ్‌సీ వైద్యుడు, సిబ్బంది



పీఎం పాలెం పీహెచ్‌సీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యసిబ్బంది



చేపలుప్పాడ యూపీహెచ్‌సీ వద్ద నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది



ర్యాలీ నిర్వహిస్తున్న గీతం వైద్యులు, వైద్య విద్యార్థులు

ఎమ్మెల్సీ బొత్సకు శుభాకాంక్షలు



బొత్సను అభినందిస్తున్న భీమిలి వైఎస్సార్‌సీపీ నాయకులు



బొత్సకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కళాకారుల సంఘం ప్రతినిధులు

తగరపువలస/మధురవాడ: స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన బొత్స సత్యనారాయణకు భీమిలి నాయకులు, కళాకారుల సంఘం ప్రతినిధులు అభినందనలు తెలిపారు. నగరంలో ఆయన నివాసంలో శనివారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. బొత్సను అభినందించిన వారిలో నాయకులు దాట్ల పెదబాబు, బోని బంగారునాయుడు, బంక సత్యం, పడాల రాము, రాష్ట్ర క్రియేటివిటీ సాంస్కృతిక విభాగం చైర్‌పర్సన్ వంగపండు ఉష, వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం రీజనల్ కో–ఆర్డినేటర్ వంకాయల మారుతీప్రసాద్, జానపద కళాకారుడు జగ్గుపల్లి అప్పారావు, శివరాజ్ తదితరులున్నారు.

క్లుప్తంగా

26 నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

తగరపువలస: త్రైత సిద్ధాంతం ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి సెప్టెంబరు 5 వరకు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను 11 రోజుల పాటు భీమిలి మండలం తాటితూరు, దాకమర్రి పంచాయతీల్లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 26న శ్రీకృష్ణుని పూజా కార్యక్రమం, భగవద్గీత పఠనంతో ప్రారంభమై సెప్టెంబరు 5న ఊరేగింపుతో ముగుస్తాయన్నారు. మండపాల వద్ద ప్రతీ రోజు ఆచార్య ప్రబోధానందుని ఆధ్యాత్మిక ప్రవచనాలు, నాటికలు, భగవద్గీత శ్లోకాల పఠనం జరుగుతుందని పేర్కొన్నారు. తాటితూరు వద్ద జరిగే కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు 97045 29963 నంబర్‌లో, దాకమర్రి వద్ద జరిగే వేడుకల్లో పాల్గొనేవారు విజయరాంపురం శాఖ వారిని 94413 29815లలో సంప్రదించాలని సూచించారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

దాకమర్రి వద్ద వేడుకలు నిర్వహించే విజయరాంపురం శాఖ ప్రతినిధులు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును కలిసి వేడుకలకు ఆహ్వానం అందించారు. ఆయనను కలిసి వారిలో విజయరాంపురం కమిటీ అధ్యక్షుడు కె.త్రినాధరావు, సభ్యులు పాల్గొన్నారు.

పేద మహిళకు చేయూత



కనకకు సరకులు అందిస్తున్న వాకర్స్, యువ భారత్ సభ్యులు

భీమునిపట్నం: తల్లిదండ్రులను కోల్పోయి ఇబ్బందుల్లో ఉన్న మహిళకు స్థానిక జమ్మి చెరువు వాకర్స్ క్లబ్, యువ భారత్ సంస్థ సభ్యులు చేయూతనందించారు. స్థానిక కృష్ణా కాలనీకి కరుభుక్త కనక దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతోంది. అవివాహితురాలైన ఆమెకు తండ్రి చిన్నతనంలోనే మరణించగా, తల్లి జయమ్మ బాగోగులు చూసుకునేది. ఇటీవల జయమ్మ కూడా మరణించడంతో ఈమెను చూసేవారు లేకుండా పోయారు. విషయం తెలుసుకున్న వాకర్స్, యువభారత్ సభ్యులు కనకకు నెలకు సరిపడా నిత్యావసర సరకులు, కొంత నగదు అందించారు. కార్యక్రమంలో సంకురుభుక్త జోగారావు, గాడు సన్యాసినాయుడు, శేషాద్రి, హేమంత్, కాళ్ల రమణ పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు రాట



రాట మహోత్సవం నిర్వహిస్తున్న అర్చకుడు సతీష్ శర్మ

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేటలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలకు శనివారం అంకురార్పణ చేశారు. అర్చకుడు సతీష్‌శర్మ ఆధ్వర్యంలో రాట మహోత్సవం నిర్వహించారు. ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు మంగమారిపేట యూత్ కమిటీ సభ్యులు తెలిపారు.

ఆదిలక్ష్మికి ఫ్యాబ్ సాయం



ఆదిలక్ష్మికి రూ.5 వేలు అందిస్తున్న ఫ్యాబ్ ప్రతినిధులు

భీమునిపట్నం: బాక్సింగ్‌లో చక్కని ప్రతిభను కనబరుస్తున్న కొనన ఆదిలక్ష్మికి స్థానిక ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి (ఫ్యాబ్) శనివారం రూ.5 వేలు ఆర్థిక సాయం అందించింది. అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన ఆదిలక్ష్మి, తప్పక విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఆమె భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో పాల్గొనాలని, ఆమెకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు కాళ్ల సన్నీ, ముసునూరి సూర్యశ్రీనివాస్, మారోజు గోపి, కట్టమూరి రమణారావు, కోచ్ ఆదినారాయణ పాల్గొన్నారు.

న్యాయం చేయాలని మత్స్యకారుల వినతి



జెడ్సీ కనకమహాలక్ష్మికి వినతిపత్రం అందిస్తున్న మత్స్యకారులు

భీమునిపట్నం: భీమిలి బీచ్‌రోడ్డులోని మత్స్యకారులకు సంబంధించిన జలగడ్డ శ్మశానవాటిక విషయంలో తమకు న్యాయం చేయాలని ఎగువపేట గ్రామాభివృద్ధి సేవా సంఘానికి చెందిన మత్స్యకారులు జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మికి శనివారం వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని తీర ప్రాంతాల్లో తమ ఆచారాల ప్రకారం మరణించిన మత్స్యకారులను బీచ్ ఇసుకలో నిర్దేశించిన ప్రకారం ఖననం చేస్తున్నామన్నారు. కానీ, ఇక్కడ దగ్గరలోని ఒక ప్రైవేటు రిసార్ట్ నిర్వహకుడు దాని వెనుకవైపు ఉన్న తమ శ్మశాన స్థలాన్ని ఆక్రమించి, వ్యాపారానికి వినియోస్తున్నాడని తెలిపారు. ఇటీవల జీవీఎంసీ అధికారులు వారికి వత్తాసు పలుకుతూ ఈ స్థలంలో ఖననాలు చేయకూడదని హెచ్చరిక బోర్డులు పెట్టారని, ఇది తమ మనోభావాలను బాధిస్తోందని తెలిపారు. ఎప్పటి నుంచో ఉన్న ఆచారాన్ని ఇలా ఒకరి స్వార్థ ప్రయోజనాల కోసం అడ్డుకోవాలని అనుకోవడం సరి కాదని, వెంటనే స్పందించి హెచ్చరిక బోర్డును తొలగించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సేవా సంఘ అధ్యక్షులు గంటా నూకరాజు, ముఖ్య నాయకులు అల్లిపిల్లి నర్సింగరావు, మైలిపల్లి షణ్ముఖరావు, బర్రి కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు రూ.4 లక్షల జరిమానా

తగరపువలస: ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 40 మందికి భీమిలి 15వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ డి.సౌజన్య శనివారం ఒక్కొక్కరికి రూ.10వేల వంతున రూ.4 లక్షలు ఫైన్ విధించారు. ఈ సందర్భంగా ఆనందపురం ట్రాఫిక్ పోలీసులు మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు విధిగా ట్రాఫిక్ నియయాలు పాటించాలని సూచించారు.

ముగిసిన షిర్డీ యాత్ర



షిర్డీలో పెద్దిపాలెం పంచాయతీ ప్రజలు

తగరపువలస: ఆనందపురం మండలం పెద్దిపాలెం పంచాయతీకి చెందిన మాజీ సర్పంచ్ మరుపల్లి చిన్నయపాత్రుడు ఆధ్వర్యంలో 60 మందితో సాగిన షిర్డీయాత్ర శనివారం ముగిసింది. ఏటా ఆయన తన సొంత ఖర్చులతో ఈ చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన స్నేహితులు, బంధువులను షిర్డీ తీసుకువెళ్లి వస్తుంటారు. ఈ నెల 14న భీమిలి, ఆనందపురం మండలాలకు చెందిన వారిని ఇక్కడి నుంచి తీసుకువెళ్లి, నాలుగు రోజుల పాటు యాత్ర చేయించి తీసుకువచ్చారు.

రెవెన్యూ రికార్డులను పరిశీలించిన స్పెషల్ సీఎస్



ఆర్డీవో కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా

భీమునిపట్నం/కొమ్మాది: భీమిలిలోని ఆర్డీవో, తహసీల్దారు కార్యాలయాల్లో రెవెన్యూ రికార్డులను ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాంప్రకాష్ సిసోడియా శనివారం పరిశీలించారు. తొలుత ఎండాడలోని హయగ్రీవ భూముల్లో నిర్మాణాలను, బీచ్‌రోడ్డు తిమ్మాపురం వద్దనున్న రామానాయుడు స్టూడియోపై ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. అలాగే బీచ్‌రోడ్డులోని ఎర్రమట్టి దిబ్బల ప్రాంతాన్ని, నాలుగో వార్డు పరిధి నేరెళ్లవలస ప్రాంతంలో విశాఖ శారదాపీఠానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయానికి విచ్చేసి భీమిలి పరిధిలోని ప్రభుత్వ భూముల రికార్డులను పరిశీలన చేశారు. అలాగే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన రిజిస్ట్రేషన్లు సక్రమంగా జరిగాయా, లేదా అన్నదానిపై అక్కడి రికార్డులను తెప్పించుకుని పరిశీలించారు. దీంతో పాటు జోన్ పరిధిలోని టౌన్ ప్లానింగ్ రికార్డులను కూడా పరిశీలన చేశారు. ఈ భూములకు సంబంధించిన వివరాలను, వాటి పరిస్థితులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొందరు తమ భూ సమస్యలకు సంబంధించి వినతులను ఇవ్వగా, వాటిని పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్, ఇన్‌చార్జి ఆర్డీవో హుస్సేన్, తహసీల్దారు పైల రామారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మజ్జివలస స్కూల్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం



మజ్జివలస ఎంపీపీఎస్ కమిటీని అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ప్రమాణ స్వీకారం చేస్తున్న అనంతవరం హైస్కూల్ ఎస్ఎంసీ పాలకవర్గం

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నిక శనివారం ఏకగ్రీవం అయింది. చైర్మన్‌గా గుడ్డాల అప్పలరాజు, వైస్ చైర్మన్‌గా బోర ధనలక్ష్మి ఎన్నికయ్యారు. వీరిని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దాట్ల పెదబాబు, సర్పంచ్ తుపాకుల ఆదిలక్ష్మి, అప్పలరాజు, వైస్ ఎంపీపీ బంగారునాయుడు, జెడ్పీ హైస్కూల్ కమిటీ చైర్మన్ బట్టు అప్పన్న, నాయకులు తుపాకుల అప్పలస్వామి, సురేష్, అప్పల రాసయ్య తదితరులు అభినందించారు.

అనంతవరంలోనూ..

పద్మనాభం: అనంతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్‌గా లోకవరపు శంకరరావు, వైస్ చైర్మన్‌గా కుప్ప సింహాచలం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల ఎనిమిదో తేదీన చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక జరగాల్సి ఉన్నా ఎనిమిదో తరగతికి కోరం చాలక మెంబర్ల ఎన్నిక జరగలేదు. ఇప్పుడు ఎనిమిదో తరగతికి కోరం సరిపోవడంతో ముగ్గురు మెంబర్లకు ఎన్నిక జరిగింది. చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకున్నారు. పోలీస్ బందోబస్తు నడుమ ఎన్నిక జరిగింది.

కొత్త కొవ్వాడ ఎన్నిక వాయిదా

కొత్త కొవ్వాడ ప్రాథమికోన్నత పాఠశాల ఎస్ఎంసీ ఎన్నికల్లో ఒకటి, నాలుగో తరగతులకు మెంబర్ల ఎన్నికకు కోరం సరిపోలేదు. దీంతో ఈ రెండు తరగతులకు సభ్యుల ఎన్నిక జరగలేదు. ఈ కారణంగా చైర్మన్, వైస్ చైర్మన్లను కూడా ఎన్నుకోలేదు.

మైనింగ్ వద్దంటూ రెండోరోజూ పాదయాత్ర



కుసులవాడలో స్థానికులతో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

తగరపువలస: ఆనందపురం మండలం కుసులవాడలో మైనింగ్‌కు అనుమతులు ఇవ్వవద్దంటూ సీపీఎం నాయకులు రెండోరోజైన శనివారం కూడా పాదయాత్ర నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు మాట్లాడుతూ ఈ నెల 28న తలపెట్టనున్న ప్రజాభిప్రాయ సేకరణను భేషరతుగా ఉపసంహరించుకోవాలన్నారు. కాలుష్యం, వ్యాధులు, పంటల నష్టానికి కారణమైన మైనింగ్‌ను ప్రతీ ఒక్కరు అడ్డుకోవాలన్నారు. పాదయాత్రలో జోన్ కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్.మూర్తి, కమిటీ సభ్యులు రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు, వాళ్ల నాగరాజు, పంపాన సూర్యనారాయణ, కొయ్య గౌరి తదితరులు పాల్గొన్నారు.

సంగివలసలో చోరీ



బాధితుల ఇంటి వద్ద వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు సంగివలస అనిట్స్ కళాశాల రహదారిలో శుక్రవారం రాత్రి అప్పరభుక్త కొండమ్మ, వెంకటరమణ ఇంట్లో దొంగలు పడి రూ.2 లక్షల నగదు, రెండు తులాల బంగారు ఆభరణాలు, 30 తులాల వెండి వస్తువులు అపహరించారు. బాధితులు తెలిపిన వివరాలివి.. కొండమ్మ, వెంకటరమణ వరలక్ష్మి పూజ కోసం సొంత ఊరైన విజయనగరం జిల్లా భోగాపురం మండలం రావాడకు వెళ్లి రాత్రి అక్కడే ఉండిపోయారు. శనివారం సంగివలస వచ్చి చూసేసరికి ఇంట్లో దొంగతనం జరిగినట్టు గుర్తించి, భీమిలి క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీమ్ వచ్చి బాధితుల ఇంట్లో వేలిముద్రలు సేకరించారు. భీమిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన

తగరపువలస: మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహనలో భాగంగా భీమిలి వ్యవసాయాధికారులు తాటితూరు రైతులతో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఏడీ విజయప్రసాద్ వరి పంటలో కలుపు యాజమాన్య పద్ధతులు, నీటి యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. పురుగులు, తెగుళ్లు, మిత్ర పురుగులు, శత్రుపురుగులపై అవగాహన కోసం బ్యాలెట్ బాక్స్ పరీక్ష నిర్వహించారు. ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధి వర్మ మాట్లాడుతూ రైతులకు పంట నిల్వ, విక్రయాల విషయంలో తమ సంస్థ ఎలా సహకరించనుందో తెలియజేశారు. భీమిలి ఏవో బి.శివకోమలి, ఆర్బీకే సిబ్బంది కృపామణి, స్వాతి, స్రవంతి, హరీష్, రమేష్ పాల్గొన్నారు.

ఏపీయూడబ్ల్యూజే జిల్లా నూతన కమిటీ ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని సత్కరిస్తున్న నల్లి ధర్మారావు తదితరులు

మధురవాడ: ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఏపీయూడబ్ల్యూజే) విశాఖ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం జరిగింది. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు నల్లి ధర్మారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె. రాము, ప్రధాన కార్యదర్శిగా ఆర్.రామచంద్రరావు, కోశాధికారిగా కె. ప్రకాశరావు, ఉపాధ్యక్షులుగా కె. చంద్రమోహన్, ఎం. కృష్ణారావు, విస్సా కుమార్, బండారు నాయుడు ఎన్నికయ్యారు. ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి. రవికుమార్, సంయుక్త కార్యదర్శులుగా గొండు అచ్యుతరావు, కేటీ రామునాయుడు (మధురవాడ), కేఎస్ ప్రసాద్‌లను ఎన్నుకున్నారు. విశాఖ జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా వాల్మీకి నాగరాజు, చందుయాదవ్, కిరణ్, సునీల్ ఎన్నికయ్యారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న గోపాలపట్నం ఎస్ఐ అప్పలనాయుడు తదితరులు

సింహాచలం: మాదక ద్రవ్యాల నిర్మూలనలో ఉపాధ్యాయులు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ సూచించారు. 98వవార్డు అడవివరం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని భీమిలి నియోజకర్గంలో పనిచేస్తున్న బయాలజీ,వ్యాయామ ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం అడవివరంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న డీఈవో ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడారు. మత్తు పదార్థాలకు యువత బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్న పరిస్థితులు కళ్లారా చూస్తున్నామన్నారు. విద్యార్థులు వాటి జోలికి వెళ్లకుండా ఉపాధ్యాయులు కూడా ఎప్పటికప్పుడు గమనిస్తుండాలన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులంతా పాఠశాల ప్రాంగణంలో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గోపాలపట్నం ఎస్ఐ అప్పల నాయుడు, రిసోర్స్ పర్సన్లు సీహెచ్.రవికుమార్, పి.రాము, లలిత్‌కుమార్, రామచంద్రనాయుడు, శేషుబాబు పాల్గొన్నారు.

కళాధరరావుకు మరో గ్లోబల్ వరల్డ్ రికార్డ్



కళాధరరావును సత్కరిస్తున్న సంస్థ సభ్యులు

మధురవాడ: ప్రముఖ యోగా మాస్టర్, మధురవాడకు చెందిన కేవీకే కళాధరరావు యోగా పోటీల్లో సరికొత్త రికార్డు నెలకొల్పారు. గ్లోబల్ వరల్డ్ రికార్డు సంస్థ ఇంటర్నేషనల్ యోగా డే సందర్భంగా వర్చువల్ పద్ధతిలో నిర్వహించిన యోగా పోటీల్లో 60ఏళ్ల వయసులో 60 నిమిషాల్లో 60 ఆసనాలు వేసి రికార్డు నెలకొల్పారు. కళాధరరావుకు సదరు సంస్థ నుంచి సర్టిఫికెట్, మెడల్స్ అందాయి. అలాగే మదర్ థెరిసా నేషనల్ అవార్డు కూడా అందుకున్నట్టు ఆయన చెప్పారు. డాక్టర్ చిన్నారావు వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు దోమన చిన్నారావు ఆధ్వర్యంలో కళాధరరావును సన్మానించారు.

‘ప్రత్యేక’ విద్యార్థులకు సదరం సర్టిఫికెట్లు తప్పనిసరి

తగరపువలస: విద్యాసంస్థల్లో చదువుతున్న ‘ప్రత్యేక’ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు తీసుకోవడానికి సదరం సర్టిఫికెట్లు అవసరమని భవితకేంద్రం ఐఈఆర్టీ పిట్ట పార్వతి అన్నారు. జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలను శనివారం ఆమె సందర్శించారు. ప్రత్యేక విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి వారికి ఏయే వసతులు అందుతాయో తెలియజేశారు. ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు, ఉపాధ్యాయుడు నరహరిశెట్టి రమేష్‌కు వివరాలు తెలియజేశారు.

చలామణిలో నకిలీ రూ.200 నోట్లు

తగరపువలస: తగరపువలస కేంద్రంగా నకిలీ రూ.200 నోట్లు చలామణిలోకి వచ్చాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. చూడటానికి అచ్చం నోట్లలా కనిపించినా ప్రత్యేకంగా చూస్తే తప్ప పోల్చుకోలేకపోతున్నామంటున్నారు. ముఖ్యంగా నిరక్షరాస్యులు, భవన నిర్మాణ కార్మికులు, చిరు వ్యాపారులు మోసగాళ్లు చలామణి చేస్తున్న ఈ నకిలీ నోట్లకు బలవుతున్నారు. వీటిపై పోలీసులు నిఘా ఉంచాలని పలువురు కోరుతున్నారు.

కావ్య పూర్ణిమకు యూనివర్సల్ డిజైన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న కావ్య పూర్ణిమ

కొమ్మాది: నగరానికి చెందిన ఆర్కిటెక్ట్ బలిజేపల్లి కావ్యపూర్ణిమ యూనివర్సల్ డిజైన్ అవార్డును అందుకున్నారు. న్యూఢిల్లీలో ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో భారత ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ కింద దివ్యాంగుల సాధికారిత విభాగం సెక్రటరీ రాజేష్ అగర్వాల్ చేతుల మీదుగా ఎన్‌సీపీఈడీపీ ఎంఫసిస్ యూనివర్సల్ డిజైన్ అవార్డు 2024 రోల్‌మోడల్‌గా జాతీయ పురస్కారం అందుకున్నారు.